APTEL/2024/89102

VIGNAN PATRIKA

# విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ
అన్ని నియోజకవర్గాలలో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 99517 75293

సంపుటి : 02 సంచిక : 50 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి గురువారం 19 మార్చి 2026 పేజీలు : 04 వెల : 02



"ఇవాళ ప్రారంభించిన ఈ దివ్యాంగ శక్తి పథకం నాకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని కలిగిస్తోంది. పవన్ కల్యాణ్, లోకేశ్ కలిసి ఈ పథకాన్ని ప్రారంభించి ప్రయాణించటం నాకు సంతృప్తిని ఇచ్చింది. దివ్యాంగులు అంటే విభిన్న ప్రతిభావంతులు, సమస్యను అధిగమించి విజయాలు సాధించే శక్తి ఉన్న వాళ్లని అర్థం. దివ్యాంగులకు గౌరవాన్ని పెంచేందుకు ఈ పథకం అమలు చేస్తున్నాం". -చంద్రబాబు ,సీఎం

## దివ్యాంగశక్తి పథకంతో

# దివ్యాంగులకు ఆత్మగౌరవం

- సాయంతో పాటు ఖర్చులూ తగ్గిస్తున్నాం
- దివ్యాంగులకు ఎల్లప్పుడూ సంక్షేమాన్ని ఇచ్చేది మేమే
- దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- మంగళగిరి నుంచి పెనుమాక వరకూ వారితో కలిసి ప్రయాణించిన సీఎం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్
- తన నివాసంలో దివ్యాంగులకు సీఎం ఆత్మీయ విందు
- దివ్యాంగుల ముసుగులో లబ్ధిపొందుతున్న వారిని ఏరి వేయాలని సీఎంకు వినతి
- ముఖ్యమంత్రి కార్యాలయంలో దివ్యాంగులతో కలిసి భోజనం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్
- ఈ సందర్భంగా దివ్యాంగ శక్తి పథకంపై లబ్దిదారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి
- దివ్యాంగులతో ముఖ్యమంత్రి మాట్లాడుతూ..
- 21 నెలల్లో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది.





# వరుస సెలవులు.



### రూ. 1,000 నుంచి రూ. 1,500 అదనంగా వసూలు

సామాన్యుడికి సొంతూరి ప్రయాణం భారంగా మారుతోంది. వరుస సెలవులు రావడంతో నగరాల్లో నివసించే ఉద్యోగులు, విద్యార్థులు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా, ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు దీనిని అదునుగా చేసుకుని ఛార్జీలను అడ్డగోలుగా పెంచేస్తున్నాయి.

- ఉగాది, రంజాన్ కు వరుస సెలవులు..
- భారీగా పెరిగిన బస్సు ఛార్జీలు..
- ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు..
- వరుస సెలవుల 'క్యాష్' పాలిటిక్స్
- సోషల్ మీడియాలో నిరసనలు..
- పండుగ రద్దీని బట్టి సాధారణ ధర కంటే

## ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

- టిడ్కో ఇళ్లకు దరఖాస్తు చేసిన వారికి తిరిగి 174 కోట్లు చెల్లింపు..
- 1,00,875 టిడ్కో ఇళ్లకు గృహప్రవేశం
- స్మార్ట్ వాటర్ పైప్ లైన్ ప్రణాళిక
- 100 రోజుల ప్రణాళిక
- 123 యూఎల్బీల్లో మౌలిక వసతులు
- అన్న క్యాంటీన్లు 70 కొత్తగా ప్రారంభం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ANDHRA PRADESH
సత్యమేవ జయతే

# ఎన్‌డీఏతో పొత్తు లేదు

- టీవీకే బీ-టీమ్ కాదు, ప్రజల టీమ్: విజయ్
- రాష్ట్రంలో ఏర్పడే ప్రభుత్వాన్ని లీడ్ చేసేది టీవీకే పార్టీయే
- లౌకికవాదం, సామాజిక న్యాయ సూత్రాల విషయంలో రాజీపడం
- దేవుడి దయతో టీవీకే పార్టీ తన లక్ష్యాన్ని సాధిస్తుంది
- ఇఫ్తార్ విందులో విజయ్ కీలక వ్యాఖ్యలు
- ప్రభుత్వాన్ని లీడ్ చేసేది టీవీకే పార్టీయే
- పెరంబూర్ బరిలో హీరో విజయ్?
- టీవీకే టార్గెట్ : చెన్నై సిటీ
- 90 అసెంబ్లీ సీట్లు, రెండున్నరేళ్లు సీఎం పదవి?



ఎన్‌డీఏ కూటమిలో తమిళగ వెట్రి కజగం (టీవీకే) చేరుతుందంటూ జరిగిన ప్రచారంపై టీవీకే అధినేత, నటుడు విజయ్ స్పందించారు. ఒక పెద్ద పార్టీకి బీ-టీమ్‌లా టీవీకే పనిచేస్తోందనే ఆరోపణలను ఆయన ఖండించారు. టీవీకే అనేది ఎవరికో బీ-టీమ్ కాదని, ఇది ప్రజల టీమ్ అని విజయ్ స్పష్టం చేశారు. పొత్తు చర్చలు అంటూ తమ పార్టీ గురించి కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. నేరుగా ఎన్‌డీఏ కూటమి పేరును ప్రస్తావించకుండానే విజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. బుధవారం తమిళనాడులోని మామల్లపురంలో జరిగిన ఇఫ్తార్ విందు వేదికగా ఆయన చేసిన ఈ కామెంట్స్ రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

**ప్రభుత్వాన్ని లీడ్ చేసేది టీవీకే పార్టీయే**

ప్రతిష్ఠను దిగజార్చే ఇతరత్రా ప్రయత్నాలు పనిచేయనప్పుడు, ప్రత్యర్థులు తప్పుడు ప్రచారాన్ని మొదలుపెడతారని విజయ్ అన్నారు.

# విజన్‌తో ముందుకెళ్తాం

- ప్రతిపక్ష నేతగా సభకు రండి కేసీఆర్
- ఒక్కోమెట్టు ఎక్కుతూ సీఎం అయ్యా... 2029లోనూ మాదే అధికారం
- నాలుగు కోట్ల ప్రజల ప్రయోజనమే మా ధ్యేయం
- గవర్నర్ ప్రసంగంపై ప్రతిపక్షం ధన్యవాదాలు తెలపకపోవడం బాధాకరం
- పంటమార్పిడిపై అన్నదాతలను చైతన్యపరుస్తాం
- ఆర్గానిక్ ఫుడ్, వాణిజ్య పంటల సాగును ప్రోత్సహిస్తాం శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి
- శుక్రవారానికి శాసనసభ వాయిదా

ఎవరు కలిసొచ్చినా.. కలిసిరాకపోయినా 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నొక్కి చెప్పారు. ప్రతి రంగానికి ప్రత్యేక పాలసీలు రూపొందించి దానికనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ సభకు వచ్చి ప్రభుత్వానికి విలువైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. విజన్‌తో కూడిన గవర్నర్ ప్రసంగానికి ప్రతిపక్షం ధన్యవాదాలు తెలపకపోవడం బాధాకరమన్నారు. పెద్దాయన పార్టీ బాధ్యతలు అప్పగించిపోతే వాళ్లిద్దరూ(కేటీఆర్, హరీశ్‌రావు) చింపిన ఇస్తరాకు మాదిరిగా మారుస్తున్నారని విమర్శించారు. తాను క్షేత్రస్థాయి నుంచి ఒక్కో మెట్టు ఎక్కుకుంటూ రాజకీయనేతగా ఎదిగి సీఎం అయ్యాననీ, 2029లోనూ తమదే అధికారమని స్పష్టం చేశారు. బుధవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు అనుసరిస్తున్న తీరుపై తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ రెండు పార్టీల వైఖరులను తప్పుబడుతూ సుదీర్ఘంగా ప్రసంగించారు. అనంతరం స్పీకర్ సభను శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు.



# విజన్‌తో ముందుకెళ్తాం

తెలంగాణ ప్రజల, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ గవర్నర్ శివప్రతాప్ శుక్లా చేసిన ప్రసంగం చారిత్రాత్మకమని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. గత చరిత్రను అనుభవాలుగా మార్చుకుంటూ భవిష్యత్ ప్రణాళికను దృష్టిలో పెట్టుకుని గవర్నర్ ప్రసంగం తయారు చేశారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 11.5 శాతం వడ్డీకి అప్పు తెస్తే కేంద్రం చుట్టూ తిరిగి దాన్ని 7.5 శాతం తగ్గించుకున్నామనీ, పార్టీ పరంగా సైద్ధాంతికంగా విభేదాలున్నప్పటికీ ఈ విషయంలో సహకరించిన నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ ఇచ్చిన మూడు నెలల్లో పరీక్షలు ఎందుకు నిర్వహించలేదని విమర్శించారు. నోటిఫికేషన్లు వేయడం, కోర్టులకు ఎక్కేలా చేయడం, నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేయడం ఆనాడు షరామామూలుగా జరిగిందన్నారు. అదే బంధువు, కుటుంబ సభ్యురాలు ఎంపీగా ఓడిపోతే మూడు నెలల్లో వారికి పోస్టులు ఇచ్చారని ఎద్దేవా చేశారు. తమ పాలనలో 80వేలకు పైగా ఉద్యోగాలను భర్తీచేశామని నొక్కి చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం విషయంలో ప్రతిపక్షం కలిసి వస్తుందని భావించినా...వారి అహంకార ధోరణి ఇంకా పోలేదని విమర్శించారు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. అధికారం పోయినా ఇంకా తామే రాజులమనే భావనతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారనీ, రాచరికంలో వారసత్వానికి అవకాశం ఉందిగానీ ప్రజాస్వామ్యంలో దానికి ఆస్కారం లేదని స్పష్టం చేశారు. తెలంగాణతల్లి ఆవిష్కరణకు ప్రధాన ప్రతిపక్ష నేత వస్తారని ఆశిస్తే నిరాశే మిగిలిందన్నారు. ప్రజలు బుద్ధి చెప్పి ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా అదే అహంకార పూరిత ధోరణి వ్యవహరిస్తున్నారని తెలిపారు. 2023 డిసెంబర్ నుంచి ఇప్పటిదాకా జీతం రూపంలో కోటీ ఆరు లక్షల రూపాయలు తీసుకున్న వ్యక్తి సభకు గైర్హాజరు కాకపోవడం సరిగాదనీ, విధులకు హాజరుకాకుండా ఉన్నవారిపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. ముందు చూపుతో స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలో జవహర్‌లాల్ నెహ్రూ ప్రణాళికలతో ముందుకెళ్లడం, ఆ తర్వాత ఇందిరాగాంధీ, రాహుల్‌గాంధీ, పీవీ నర్సింహారావు, మన్మోహన్‌సింగ్ తీసుకున్న కీలక నిర్ణయాలు, సంస్కరణలు ప్రపంచం ముందు భారత్‌ను ఒక శక్తివంతమైన దేశంగా నిలబెట్టాయన్నారు. పేదలకు ఇండ్లు, ఇండ్లస్థలాలు ఇచ్చిన, సీలింగ్, అసైన్డ్ భూములు పంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనన్నారు. వారి వ్యూహాత్మక ఎత్తుగడలతోనే నేడు ప్రపంచంలోని దిగ్గజ కంపెనీలకు మన దేశం వారు సీఈఓలుగా ఉన్నారని గుర్తుచేశారు. సిలికాన్ వ్యాలీలో మన తెలుగువాళ్లు రాణించడానికి కారణం రాహుల్‌గాంధీ, పీవీ, మన్మోహన్‌సింగ్ తీసుకున్న సంస్కరణలే కారణమని వివరించారు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి హైదరాబాద్‌లో హైటెక్ సిటీకి శంకుస్థాపన చేస్తే చంద్రబాబు ముందుకు తీసుకెళ్లారని తెలిపారు.

**ఆక్రమణలు తొలగించడం... నాలాలను రక్షించడం ఇష్టం లేదా?**

తాము మూసీ సుందరీకరణ చేస్తామంటే ప్రతిపక్షం అడ్డుపడుతామని చెప్పటాన్ని సీఎం తప్పుబట్టారు. ఆక్రమణలు తొలగించడం, పరిశ్రమలు తరలించడం, చెరువులు, నాలాలను పరిరక్షించడం లాంటి మంచి చేయొద్దా? అని నిలదీశారు. కాలుష్యంతో రాజధాని ఢిల్లీ, వర్షాల ఎఫెక్ట్‌తో ఫైనాన్షియల్ రాజధాని ముంబై, ట్రాఫిక్ సమస్యతో బెంగుళూరు నగరాలు కూరుకుపోవడంతో ఐటీ, తదితర రంగాల పరిశ్రమలు తెలంగాణ వైపు చూస్తున్నాయని వివరించారు. నల్లచెరువును హైడ్రా రక్షిస్తే ప్రజలు బ్రహ్మరథం పట్టారనీ, ఉమర్‌ఉద్దౌల్లా చెరువు పునరుద్ధరిస్తే ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయని చెప్పారు. తుమ్మిడి కుంటను ప్రముఖ సినీస్టార్ అక్రమించుకుంటే ఆక్రమణలు తొలగించి చెరువును కాపాడామనీ, రియల్టర్ల కబ్జా నుంచి సున్నం చెరువును రక్షించుకున్నామని వివరించారు. బేగంపేటలో 200 ఫీట్ల ఉన్న నాలా 30 ఫీట్లకు కుచించుకుపోయిందనీ, హైదరాబాద్ నగరాన్ని కొంత మంది దురాశపరులు ఆక్రమణలకు పాల్పడితే కాడపాడుతున్నామని నొక్కి చెప్పారు. ఇలా మంచి పనులు చేస్తుంటే అడ్డుకోవడమేంటని నిలదీశారు. హైదరాబాద్ నగరంలో నాలాలపై 28వేల అక్రమ కట్టడాలున్నాయనీ, చట్టం ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చేయాలని చెబుతున్నదని కేసీఆర్ అనలేదా? ప్రశ్నించారు. డ్రోన్లతో, మ్యానువల్‌గా సర్వేలు చేయించి అక్రమ కట్టడాలను జేసీబీలతో కూల్చేస్తామని కేటీఆర్ చెప్పలేదా? అని నిలదీశారు. మూసీలో కంటే వీళ్ల కడుపులో ఎక్కువ విషం ఉందని విమర్శించారు. మీ పాలిత రాష్ట్రాల్లో సబర్మతీ, గంగా, యమునా రివర్ ఫ్రంట్ల పేరుతో ప్రక్షాళన చేస్తున్నారు కదా? సబర్మతిలో వేల కుటుంబాలు నిర్వాసితులు అయ్యారు కదా? అందులో ఎంత మందికి పరిహారం ఇచ్చారు? దానిపై నిజనిర్ధారణ కమిటీ వేసి పంపుదామా? ఇక్కడ మూసీ ప్రక్షాళన చేసుకుంటుంటే వచ్చిన సమస్య ఏంటి? అని బీజేపీ సభ్యులను ప్రశ్నించారు. హైదరాబాద్‌లో పర్యావరణాన్ని మెరుగుపర్చేందుకు డీజీల్‌తో నడిచే 2800 ఆర్టీసీ బస్సుల స్థానంలో ఈ ఏడాది డిసెంబర్ నాటికి 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు తీసుకురాబోతున్నామని తెలిపారు. నగరంలోకి డీజిల్, పెట్రోల్ ఆటోలకు ఈవీ ఇంజన్లను పిట్ చేయిస్తామన్నారు. ఈవీ వాహనాలను కొంటున్నవాళ్లపై పన్ను వేయట్లేదని స్పష్టం చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం మూడు కార్పొరేషన్లు, మూడు కమిషనరేట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. డబ్బుల కోసం వాళ్లు మెట్రోను ఆపితే తాము ట్రాఫిక్ నియంత్రణకు మెట్రోను విస్తరిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పాలకులు ఔటర్ రింగ్‌రోడ్డును పల్లీబఠాణీలకు అమ్ముకున్నారని విమర్శించారు. పబ్లిక సెక్టార్‌ను తెగనమ్ముతున్న ఈ రోజుల్లో తెలంగాణ ప్రభుత్వం మెట్రోను స్వాధీనం చేసుకున్నదని గుర్తుచేశారు. ఆర్ఆర్ఆర్ చుట్టూ రింగ్ రైలు కూడా రాబోతున్నదని తెలిపారు. కేంద్రం బుల్లెట్ ట్రైన్ హబ్ ను తెలంగాణకు ఇచ్చిందన్నారు.

**ఆర్గానిక్ సాగును ప్రోత్సహిస్తాం**

ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తామని సీఎం చెప్పారు. వరి వేసుకుంటే ఉరి వేసుకుంటరు అన్నోళ్లు రూ.4200 క్వింటా ఎలా అమ్ముకుంటున్నారు? బ్లాక్‌మనీని వైట్‌మనీగా చేసుకుంటున్నారా? అని ప్రశ్నించారు. క్యాప్సికం పంట సాగు చేస్తే ఎకరానికి కోటి సంపాదించొచ్చు అంటున్నారు కదా...ఆ విద్య తెలంగాణ రైతులకు ఎందుకు నేర్పించడం లేదు? రైతులు కోటీశ్వర్లు కావడం ఇష్టం లేదా? అని అడిగారు. రాష్ట్రంలో కోటీ ఆరు లక్షల కుటుంబాలకు సన్నబియ్యం ఇస్తున్నామనీ, సన్నబియ్యంతో సభలోని ప్రజాప్రతినిధులకు ఒక రోజు భోజనం పెట్టించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సీఎం సూచించారు. ఆర్గానిక్ ఫుడ్‌కు ప్రపంచస్థాయిలో డిమాండ్ ఉందనీ, రైతును రాజుగా చేసే ప్రణాళికలతో ముందుకెళ్తున్నామని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు రాష్ట్రంలోని వంద నియోజకవర్గాల్లో రూ.2400 కోట్లతో ఏటీసీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏఐ సునామీని తట్టుకునేలా యువతను తయారు చేస్తున్నామనీ, అందులో చదువుకునే విద్యార్థులకు రూ.2 వేల స్కాలర్‌షిప్పు ఇస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో బ్లూకాలర్ జాబ్‌లు క్రియేట్ చేస్తామని చెప్పారు.

**విశ్వాసఘాతకులుగా మారకండి**

తెలంగాణ కాంగ్రెస్ దయతో, సోనియాగాంధీ ఆశీర్వచనంతో వచ్చిందని కేసీఆర్‌నే చెప్పారని సీఎం రేవంత్‌రెడ్డి సభలో గుర్తుచేశారు. కేసీఆర్ మాట్లాడిన మాటలను కూడా వ్యతిరేకిస్తారా? విశ్వాసఘాతకులుగా మారకండి అంటూ కేటీఆర్, హరీశ్‌రావులకు చురకలు అంటించారు. మీరు కాదన్నా తెలంగాణ సమాజం సోనియాగాంధీని ఎల్లకాలం గుర్తుపెట్టుకుంటుందని చెప్పారు. నమ్మి పార్టీని అప్పగించి పోతే కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేసేందుకు, ఆయనకు వ్యతిరేకంగా బావబామ్మర్దులు పనిచేస్తున్నారని విమర్శించారు. నోటిఫికేషన్లు ఇచ్చి ఉద్యోగాలు భర్తీ చేసేందుకు పదేండ్లు పడుతుందా? పదేండ్లు మీరే అధికారంలో ఉన్నారు కదా ఎందుకు భర్తీ చేయలేదు? అని ప్రశ్నించారు.

# ఉద్యోగులకు ఏపీ సర్కార్ వరాలు

**- రెండు నెలల పితృత్వ సెలవులు, ఐవీఎఫ్ రాయితీ**
**-మూడో సంతానానికి పురుష ఉద్యోగులకు 2 నెలల పితృత్వ సెలవులు**
**- ఉద్యోగినుల కోసం చైల్డ్ కేర్ సెంటర్లు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు**
**- ప్రభుత్వ ఆసుపత్రుల్లో సంతానలేమికి ఐవీఎఫ్ చికిత్సపై రాయితీ**
**-రెండో సంతానం నుంచి రూ.25 వేల ప్రోత్సాహకం**
**-పదవీ విరమణకు ముందు ఉద్యోగులకు 15 రోజుల వెల్‌నెస్ లీవ్**

ఏపీ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం, జనాభా నియంత్రణ విధానాలపై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో తగ్గుతున్న జనాభా వృద్ధి రేటును పెంచే లక్ష్యంతో మూడో సంతానం పొందిన పురుష ఉద్యోగులకు ప్రయోగాత్మకంగా రెండు నెలల పాటు పితృత్వ సెలవులు మంజూరు చేయనున్నట్లు ప్రకటించింది. అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ ఈ వివరాలు వెల్లడించారు. పిల్లల సంరక్షణలో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమే దీని ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు.

**మహిళా ఉద్యోగులకు అండగా ప్రభుత్వం**

మహిళా ఉద్యోగుల సౌకర్యార్థం కూడా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. 50 మందికి పైగా మహిళా సిబ్బంది ఉన్న కార్యాలయాల్లో తప్పనిసరిగా చైల్డ్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా మహిళల కోసం పింక్ టాయిలెట్లు, షీ క్యాబ్స్ సేవలను మరింత విస్తృతం చేయనున్నారు. దీనికి తోడు రూ.172 కోట్ల వ్యయంతో 23 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లకు ప్రభుత్వం మంజూరు ఇచ్చింది. ఒక్క విశాఖపట్నంలోనే మూడు హాస్టళ్లను నిర్మిస్తున్నారు. భవిష్యత్తులో ప్రతి లక్ష పట్టణ జనాభాకు కనీసం ఒక వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఉండేలా చూడాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**రెండో బిడ్డకు రూ.25 వేల ప్రోత్సాహం**

అలాగే, సంతానలేమితో బాధపడుతున్న దంపతులకు ప్రభుత్వం అండగా నిలవనుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఐవీఎఫ్ వంటి సంతాన సాఫల్య చికిత్సలకు రాయితీ కల్పించనున్నారు. రెండో సంతానం నుంచి రూ.25 వేల ఆర్థిక ప్రోత్సాహకాన్ని కూడా అందించాలని నిర్ణయించారు. మరోవైపు రాష్ట్రంలో అధికంగా ఉన్న సిజేరియన్ ప్రసవాలను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం 67.5 శాతంగా ఉన్న సీ-సెక్షన్ల రేటును 40 శాతం కంటే తక్కువకు తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఉద్యోగుల ఆరోగ్యంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. పదవీ విరమణకు రెండేళ్లు ముందున్న సుమారు 50 వేల మంది ఉద్యోగులకు 'వెల్‌నెస్ లీవ్' పేరుతో సరికొత్త ప్రయోజనాన్ని ప్రకటించింది. దీని కింద ఉద్యోగులకు 15 రోజుల పాటు ప్రత్యేక సెలవుతో పాటు ఆరోగ్య పరీక్షల కోసం రూ.50 వేల వరకు ఆర్థిక సహాయం అందించనున్నారు. వీటితో పాటు ప్రతి కుటుంబానికి సమగ్ర ఆరోగ్య బీమా అందించే 'సంజీవని', ప్రతి నాలుగో శనివారం 'ఆరోగ్య ఆంధ్ర ప్రజా వేదిక' వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అధికారులు వివరించారు.

## దివ్యాంగుల ఆత్మగౌరవమే లక్ష్యం

# ఉగాది కానుక – 'దివ్యాంగ శక్తి'

- ➤➤ రూ.500 ఉండే దివ్యాంగుల పెన్షన్ ను రూ.6 వేలకు పెంచి ఇస్తున్నాం.
- ➤➤ తీవ్ర ఆరోగ్య ఇబ్బందుల్లో ఉండే వారికి రూ.10 వేలు, మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలు ఇస్తున్నాం.
- ➤➤ రూ.33 వేలు ఏటా పింఛన్ల కోసం ఖర్చు చేస్తున్నాం.
- ➤➤ ఇప్పుడు బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం.
- ➤➤ ఎలాంటి ఖర్చు లేకుండా 5 రకాల బస్సుల్లో దివ్యాంగులు ఇక ఉచితంగా ప్రయాణం చేయవచ్చు.
- ➤➤ పనులకు, అవసరాలకు ఖర్చు లేకుండా ప్రయాణం చేయవచ్చు.
- ➤➤ నెలకు రూ.2 వేల దాకా మీ అందరికీ ఆదా అయ్యే అవకాశం ఉంది
- ➤➤ మొదటి నుంచి దివ్యాంగుల సంక్షేమానికి పనిచేస్తోంది మేమే.
- ➤➤ భవిష్యత్తులోనూ దివ్యాంగులను ఆదుకునేలా మరిన్ని ఆలోచనలు చేస్తాం.
- ➤➤ దివ్యాంగ శక్తి పథకంతో ఈ ఉగాది మరింత బాగా జరుపుకోండి. అందరికీ ఉగాది శుభాకాంక్షలు.
- ➤➤ దివ్యాంగ శక్తి ద్వారా 12.75 లక్షల మందికి

**ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తున్నాం**

దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని పెంచుతూ, వారి సాధికారతకు బాటలు వేసే దిశగా ఏపీ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే 'దివ్యాంగశక్తి' పథకాన్ని సీఎం చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించారు. మంగళగిరిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంగళగిరి బస్టాండ్ నుంచి రాజధాని ప్రాంతంలోని పెనుమాక వరకు సుమారు 11 కిలోమీటర్ల పాటు దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ పథకం ద్వారా 40 శాతానికి పైగా వైకల్యం ఉన్న దివ్యాంగులు ఏపీఎస్ఆర్టీసీకి చెందిన పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించవచ్చు. దివ్యాంగులతో పాటు వారి సహాయకులకు ప్రయాణ ఛార్జీలో 50 శాతం రాయితీ కల్పించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 12.76 లక్షల మంది దివ్యాంగులకు ప్రయోజనం చేకూరనుంది. ఇందుకోసం ప్రభుత్వం ఏటా రూ.207 కోట్లను ఆర్టీసీకి చెల్లించనుంది. పథకం ప్రారంభం అనంతరం సీఎం చంద్రబాబు తన నివాసంలో పలువురు దివ్యాంగులకు ఆత్మీయ విందు ఏర్పాటు చేసి, వారితో కలిసి భోజనం చేశారు.

**దివ్యాంగులకు అండగా ఉంటాం: సీఎం చంద్రబాబు**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... "దివ్యాంగులంటే విభిన్న ప్రతిభావంతులు. వారిలో ఆత్మవిశ్వాసం నింపి, సాధికారత సాధించేలా చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం. కేవలం సాయం అందించడమే కాకుండా, వారి ఖర్చులను తగ్గించి గౌరవాన్ని పెంచడంపైనే దృష్టి సారించాం. గతంలో రూ.500గా ఉన్న పింఛన్‌ను మేమే దశలవారీగా పెంచాం. ఇప్పుడు రూ.6,000 ఇస్తున్న ఏకైక ప్రభుత్వం మాదే. తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారికి రూ.10 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు అందిస్తున్నాం. ఇప్పుడు ఉచిత బస్సు ప్రయాణంతో వారికి నెలకు సుమారు రూ.2,000 వరకు ఆదా అవుతుంది" అని వివరించారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం వల్లే దివ్యాంగుల పింఛన్ పెరిగిందని, 'దివ్యాంగశక్తి' వంటి పథకాలు అమలవుతున్నాయని చంద్రబాబు గుర్తుచేశారు. "గత ప్రభుత్వం దివ్యాంగులకు ఒక్క రూపాయి కూడా పింఛన్ పెంచలేదు. అంతేకాకుండా, దివ్యాంగుల కోటాలో అర్హత లేని వారు కూడా ఉద్యోగాలు, పింఛన్లు పొందడం బాధాకరం. అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాం" అని సీఎం స్పష్టం చేశారు. మహిళల కోసం ప్రవేశపెట్టిన 'స్త్రీశక్తి' పథకం ద్వారా ఇప్పటికే 52 కోట్ల ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయని, అదే స్ఫూర్తితో 'దివ్యాంగశక్తి' కూడా విజయవంతమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**కూటమి ప్రభుత్వం కలకాలం ఉండాలి: దివ్యాంగులు**

ముఖ్యమంత్రి ఇచ్చిన విందులో పాల్గొన్న దివ్యాంగులు తమ ఆనందాన్ని పంచుకున్నారు. రూ.6,000 పింఛన్‌తో పాటు ఇప్పుడు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ లాంటి వారికి అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వం మరో 15 ఏళ్లు అధికారంలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కొందరు దివ్యాంగులు తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దివ్యాంగుల ముసుగులో కొందరు తప్పుడు ధ్రువపత్రాలతో ప్రభుత్వ పథకాలు, ఉద్యోగాలు పొందుతున్నారని, దీనిపై క్షుణ్ణంగా విచారణ జరిపి అనర్హులను ఏరివేయాలని ముఖ్యమంత్రిని కోరారు. వారి విజ్ఞప్తిపై సీఎం సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది.

# ఎన్‌డీఏతో పొత్తు లేదు

ఈక్రమంలోనే ఎన్నికల పొత్తులపై టీవీకే చర్చలు జరుపుతోందనే తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేశారని ఆయన చెప్పారు. దీని గురించి విని పార్టీ క్యాడర్ కొంత అయోమయానికి గురై ఉండొచ్చన్నారు. రాష్ట్రంలో ఏర్పడే ప్రభుత్వాన్ని లీడ్ చేసేది టీవీకే పార్టీయేనని విజయ్ ఈసందర్భంగా తేల్చి చెప్పారు. అయితే లౌకికవాదం, సామాజిక న్యాయ సూత్రాల విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారాన్ని అస్సలు నమ్మొద్దని, దేవుడి దయతో టీవీకే పార్టీ తన లక్ష్యాన్ని సాధిస్తుందని ఆయన విశ్వాసాన్ని వెలిబుచ్చారు. 2024లో జరిగిన టీవీకే పార్టీ మొట్టమొదటి సమావేశంలో చెప్పిన అన్ని మాటలకు కట్టుబడి ఉంటానన్నారు.

**పెరంబూర్ బరిలో హీరో విజయ్ :** చెన్నైలోని పెరంబూర్ అసెంబ్లీ స్థానం నుంచి హీరో విజయ్ పోటీ చేసే అవకాశం ఉందని టీవీకే పార్టీ వర్గాలు బుధవారం తెలిపాయి. ఇక టీవీకే ప్రధాన కార్యదర్శులు బస్సీ ఎన్ ఆనంద్, ఆధవ్ అర్జున టీ నగర్, విల్లివక్కమ్ స్థానాల నుంచి పోటీచేసే ఛాన్స్ ఉందని చెప్పాయి. టీవీకేలో చేరిన అన్నాడీఎంకే మాజీ నేత జేసీడీ ప్రభాకర్ థౌజండ్స్ లైట్స్ స్థానం నుంచి బరిలోకి దిగొచ్చని తెలుస్తోంది. త్వరలోనే అభ్యర్థుల తొలి జాబితాను టీవీకే పార్టీ విడుదల చేయనుంది.

**టీవీకే టార్గెట్ - చెన్నై సిటీ :** చెన్నై నగరం, దాని శివారు ప్రాంతాల్లోని అసెంబ్లీ స్థానాలపై డీఎంకే పార్టీకి బలమైన పట్టు ఉంది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నై సిటీ పరిధిలోని అన్ని 16 స్థానాలను డీఎంకే పార్టీయే గెల్చుకుంది. డీఎంకేకు చెందిన చాలామంది దిగ్గజ నేతలు ఈ స్థానాల్లోనే పోటీ చేస్తున్నారు. అందుకే విజయ్ సైతం చెన్నైలోని పెరంబూర్ అసెంబ్లీ స్థానాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ చెన్నైలోని కొలథూర్ స్థానం నుంచి, ఉప ముఖ్యమంత్రి, సీఎం కుమారుడు ఉదయనిధి చెపాక్ – తిరువల్లికేణి స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. హార్బర్ నియోజకవర్గం నుంచి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్ బాబు, సైదాపేట్ నుంచి రాష్ట్ర ఆరోగ్య మంత్రి ఎంఏ సుబ్రమణ్యన్ పోటీ చేస్తున్నారు.

**90 అసెంబ్లీ సీట్లు, రెండున్నరేళ్లు సీఎం పదవి :** ఆంధ్రప్రదేశ్‌లో జనసేన–టీడీపీ–బీజేపీ మధ్య పొత్తు కుదిరినట్టుగానే, తమిళనాడులో టీవీకే–ఎన్‌డీఏ కూటమి మధ్య పొత్తు కుదురుతుందని గత ఐదారు రోజులుగా మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఎన్‌డీఏ కూటమి, టీవీకే మధ్య పొత్తు చర్చలు జరిగాయని, విజయ్‌కు డిప్యూటీ సీఎం పదవిని ఆఫర్ చేశారనే టాక్ వినిపించింది. అయితే ఈ ప్రచారాన్ని టీవీకే నేతలంతా ఖండించారు. ఎన్‌డీఏతో టీవీకేకు పొత్తు కుదిరే అవకాశమే లేదని వారు స్పష్టం చేశారు. ఇక ఈవిషయంలో విజయ్ క్లారిటీని ఇవ్వడం ఇదే తొలిసారి. అన్నాడీఎంకే – బీజేపీలతో పొత్తు లేదని ఆయన తేల్చి చెప్పారు. తమిళనాడు రాష్ట్రంలో మొత్తం 234 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. టీవీకే నేత ఆధవ్ అర్జున ప్రకారం, విజయ్ పార్టీకి 90 అసెంబ్లీ సీట్లతో పాటు రెండున్నర ఏళ్లపాటు సీఎం పదవిని ఎన్‌డీఏ కూటమి ఆఫర్ చేసింది. అయితే ఢిల్లీ ఎదుట తాము మోకరిల్లేది లేదని ఆధవ్ అర్జున అన్నారు. పరోక్షంగా బీజేపీని ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్య చేశారు. నేరుగా బీజేపీ నుంచే టీవీకేకు పొత్తు ఆఫర్ వచ్చిందనే టాక్ పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. ఇక టీవీకేతో ఎన్‌డీఏ కూటమి పొత్తు చర్చలు జరపనే లేదని, ఆ కూటమిలోని ప్రధాన మిత్రపక్షం అన్నా డీఎంకే వెల్లడించింది.

# 2029లో కూడా మళ్లీ బరాబర్ తొక్కుకుంటూ వస్తా: సీఎం రేవంత్‌రెడ్డి

వారు నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆక్షేపించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చపై ఆయన అసెంబ్లీలో సమాధానమిచ్చారు.

**కేసీఆర్‌ది అహంకార ధోరణి :** విపక్ష నేత సమయం, సందర్భం లేకుండా నచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే నాయకులని తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు అదే అహంకార ధోరణి, అధికారం పీకేసినా అదే అహంకారంతో వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. నూతన గవర్నర్‌ను కలవడానికి ప్రతిపక్ష నేత కేసీఆర్? వస్తారనుకున్నామని, రాకపోగా సభ సాంప్రదాయాలను గౌరవించకపోడం తెలంగాణ సంస్కృతికి పూర్తి విరుద్ధం అని అసహనం వ్యక్తం చేశారు.

ఎవరు కలిసివచ్చినా రాకపోయినా సరే : ప్రభుత్వం చేపట్టిన ఏ ప్రణాళికలోనైనా రాజకీయం, స్వార్థం, అధికారం కోల్పోయామనే బాధనే విపక్షాల మాటల్లో కనిపిస్తోందని ఆరోపించారు. ఎవరు కలిసి వచ్చినా.. రాకపోయినా తమ ప్రభుత్వం ముందుకెళ్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ 2047లో తెలంగాణను మూడు భాగాలుగా విభజించామని తెలిపారు. ప్రస్తుతం పెట్టుబడిదారులు ఎక్కువగా హైదరాబాద్ వైపు చూస్తున్నారని, అందుకు తగ్గట్టుగానే అభివృద్ధి ప్రణాళికలు రూపొందించినట్లు అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటించారు. తమ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీల్లో ఒకటి తప్పా మిగతావన్నీ అమలు చేస్తున్నట్లు వివరించారు. సొంత ఆడబిడ్డనే అవమానించారు : మహిళల పట్ల బీఆర్ఎస్ నేతలకు ఏ మాత్రం గౌరవం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. సొంతింటి ఆడబిడ్డను బాధపెట్టిన వారు మహిళ గురించి ఎలా ఆలోచిస్తారని ఆయన ప్రశ్నించారు. సొంత ఆడబిడ్డను లిక్కర్ రాణి అని, సొంత పార్టీ నేతలతో తిట్టించారని ఆరోపించారు.

# వరుస సెలవులు

**వరుస సెలవుల 'క్యాష్' పాలిటిక్స్**

ఈ వారం మార్చి 19న ఉగాది, 21న రంజాన్, 22న ఆదివారం కావడంతో మధ్యలో ఉన్న శుక్రవారం ఒక్క రోజు సెలవు పెడితే వరుసగా నాలుగు రోజులు పండుగను కుటుంబంతో గడపవచ్చని చాలామంది ప్రణాళికలు వేసుకున్నారు. అయితే.. ఆర్టీసీ బస్సులు, రైళ్లలో రిజర్వేషన్లు ఎప్పుడో నిండిపోవడంతో ప్రయాణికులకు ప్రైవేట్ ట్రావెల్స్ మాత్రమే ప్రత్యామ్నాయంగా మిగిలాయి. దీనిని ఆసరాగా చేసుకున్న కొన్ని సంస్థలు సామాన్యుల జేబులకు చిల్లు పెడుతున్నాయి. సాధారణ రోజుల్లో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు ప్రైవేట్ బస్సు ఛార్జీ సుమారు రూ. 1,500 నుంచి రూ. 2,000 మధ్య ఉంటుంది. కానీ ఈ లాంగ్ వీకెండ్ దృష్ట్యా కొన్ని ట్రావెల్స్ ధరలను ఏకంగా 3 నుంచి 4 రెట్లు పెంచేశాయి. నాన్ ఏసీ స్లీపర్ సీట్లకు కొన్ని ప్రముఖ ట్రావెల్స్ సంస్థలు ఒక వ్యక్తికి ఏకంగా రూ. 4,999 నుంచి రూ. 5,700 వరకు వసూలు చేస్తున్నాయి. ఏసీ స్లీపర్‌కు కొత్తగా అందుబాటులోకి వచ్చిన సర్వీసుల్లో కూడా టికెట్ ధర రూ. 5,300 దాటిపోయింది. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్లే బస్సుల ఛార్జీలు కూడా గణనీయంగా పెరిగాయి. పండుగ రద్దీని బట్టి సాధారణ ధర కంటే రూ. 1,000 నుంచి రూ. 1,500 అదనంగా వసూలు చేస్తున్నారు.

**సోషల్‌మీడియాలో నిరసనలు..**

పెంచిన ధరలకు సంబంధించిన స్క్రీన్ షాట్లను ప్రయాణికులు సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ తమ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. 'విమాన ప్రయాణం కంటే బస్సు టికెట్ ధరలే ఎక్కువగా ఉన్నాయని, ఇలాగైతే ఇంటికి వెళ్లడం కంటే నగరంలోనే ఉండిపోవడం మేలు' అని నెటిజన్లు వాపోతున్నారు. సాధారణంగా దసరా, సంక్రాంతి వంటి పెద్ద పండుగల సమయంలో రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టి, అధిక ధరలు వసూలు చేసే ట్రావెల్స్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తుంటారు. కానీ.. ఇలాంటి 'లాంగ్ వీకెండ్స్' (వరుస సెలవులు) సమయంలో ప్రైవేట్ దోపిడీని అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ప్రయాణికులు వీలైనంత వరకు ముందే టికెట్లు బుక్ చేసుకోవడం లేదా ప్రభుత్వం ఏర్పాటు చేసే అదనపు ఆర్టీసీ బస్సులను ఆశ్రయించడం ద్వారా ఈ భారం నుంచి కొంతవరకు తప్పించుకోవచ్చు.

## ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

ఏపీ ప్రభుత్వం తాజాగా టిడ్కో ఇళ్లకు సంబంధించిన కీలక నిర్ణయం తీసుకుంది. 83,865 మందికి గృహాల అలాట్‌మెంట్ కావని తేలిపోవడంతో.. వారికి రూపాయలు 174 కోట్లు తిరిగి చెల్లించాల్సి ఉందని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ చర్య, టిడ్కో ఇళ్ల కొరకు ముందుగా దరఖాస్తు చేసిన వారు ఈ సొమ్ము తిరిగి పొందే అవకాశం రావడంతో.. వారికి అన్యాయం కాకుండా ఉందనే చెప్పాలి.. ఇక, 1,00,875 టిడ్కో ఇళ్లకు గృహప్రవేశం చేసే ప్లాన్ కూడా త్వరలో ప్రారంభం అవుతుంది. అనంతరం, రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో బిల్డింగ్ డోర్స్ కు క్యూఆర్ కోడ్ నెంబర్లు జతచేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తాగునీరు కలుషితం కాకుండా, స్మార్ట్ వాటర్ పైప్ లైన్ తయారీకి గ్రిడ్ ప్రణాళిక అమలు చేయనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. మున్సిపల్ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అదేవిధంగా 100 రోజుల ప్రణాళిక కోసం 123 యూఎల్బీల్లో మౌలిక వసతుల అమలు కూడా ప్రారంభం అవుతోంది. అన్న క్యాంటిన్లు ప్రారంభించడం దిశగా 70 అన్న క్యాంటిన్లు త్వరలో ప్రారంభం అవుతాయని సీఎం తెలిపారు.

## 300 నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్ల పంపిణీ: ఈద్గహ్ యూత్ అసోసియేషన్

**-సమాజసేవే మా లక్ష్యం: ఈద్గాహ్ యూత్ అధ్యక్షుడు షేక్ షబ్బీర్**
**-ప్రతి ఒక్కరూ పండుగ చేసుకోవాలి : షఫీ మౌలానా**



**-300 నిరుపేద కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్లు పంపిణీ : యస్దాని**

గూడూరు: పవిత్ర రంజాన్ పండుగ ను ప్రతి ఒక్కరు సంతోషం గా జరుపుకోవాలనే ఏకైక లక్ష్యం తో ప్రతి సంవత్సరం ఈద్గాహ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరుపేద ముస్లిం కుటుంబాలకు బియ్యం, నూనె, పప్పు, సేమియా, నెయ్యి, చింతపండు, జీడిపప్పు ఇలా 700 రూపాయల తో 13 వస్తువుల ఒక కిట్ లా తయారు చేసి 300 కుటుంబాలకు ఇవ్వడం జరిగిందని ఈద్గాహ్ యూత్ అసోసియేషన్ ఎప్పుడూ సమాజసేవలో ముందుంటుందని అందులో భాగంగానే ఈ ఏడాది కూడా నిరుపేదలను గుర్తించి ఈద్గా యూత్ అసోసియేషన్ సభ్యుల సహకారం తో ఈ కార్యక్రమాన్ని గూడూరు పట్టణం లోని దర్గా నందు నిర్వహించడం జరిగిందని మరియు కొంతమంది నిరుపేద ముస్లింల ఇళ్ల వద్దకే వెళ్లి అందించడం జరిగిందని అన్నారు. ఉపాధ్యక్షులు షఫీ మౌలానా మాట్లాడుతూ రంజాన్ మాసం విసిష్టత నమాజ్ ఉపవాసాల తో పాటు నిరుపేదలకు ఫిత్ర దాన ధర్మాలు చెయ్యమని ఇస్లాం చెబుతుందని అందులో భాగంగా ఈ రోజు ఈద్గాహ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరుపేద ముస్లిం లకు రంజాన్ తోఫా కిట్లను ఇవ్వడం చాలా సంతోషం గా ఉందని రాబోయే రోజుల్లో ఇంకా ఎక్కువ మందికి ఇచ్చే భాగ్యన్ని అల్లాహ్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఈద్గాహ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ షబ్బీర్, ఉపాధ్యక్షులు షఫీ మౌలానా,కార్యదర్శి యస్దాని,కోశాధికారి నయీమ్,సంయుక్త కార్యదర్శి పి ఆర్ కె మున్నా, సభ్యులు ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## కృప సేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో అన్నదానం కార్యక్రమం...



నెల్లూరు జిల్లా గూడూరు పట్టణంలోని ఓం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో ఈ రోజు బుధవారం 18/03/2026 వ తేదీన గోపిక సహస్ర 11 వ పుట్టినరోజు సందర్భంగా కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు, పిల్లలకు, వికలాంగులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు ఈ అన్నదాన కార్యక్రమానికి ముఖ్య దాతలుగా ముచ్చకాల విజయకుమార్, కల్పన దంపతుల పుత్రిక గోపిక సహస్ర 11 వ పుట్టినరోజు సందర్భంగా పేదవాళ్ళకి అన్నదానం చేయాలని సంకల్పంతో ఎక్కడో వేరే దేశంలో ఉన్న కానీ వాళ్ల పాప పుట్టినరోజు న వృద్ధులకు వికలాంగులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ట్రస్ట్ అధ్యక్షులు కటకం శ్రీనివాసులు మాట్లాడుతూ గత రెండేళ్లుగా కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని అందులో భాగంగా ఈ రోజున ముచ్చకాల విజయకుమార్, కల్పన దంపతుల పుత్రిక గోపిక సహస్ర 11 వ పుట్టినరోజు సందర్భంగా వారి దాతృత్వంతో నిరాశ్రయులైన వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. తమ ట్రస్ట్ ద్వారా రానున్న కాలంలో దాతలు సహకరిస్తే వారంలో రెండు కార్యక్రమాలు నిరుపేదలకు ఉపయోగపడేలా సేవ చేయాలని ఆలోచనతో ఉన్నామని కాబట్టి దాతలు ముందుకు వచ్చి తమ సహాయ సహకారాలు అందించి ముందుకు తీసుకుపోవాలని కోరుతున్నామన్నారు.. ఈ కార్యక్రమంలో కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కటకం శ్రీనివాసులు,కన్వీనర్ పర్వతాల రమేష,సభ్యులు. చవల సురేంద్ర, పేయ్యల రమణయ్య, ఎస్. కె మూజిఫ్ రమణయ్య వృద్ధాశ్రమం నిర్వహణాలు కళ్యాణి తదితరులు పాల్గొన్నారు..

## రంజాన్ పర్వదినం సందర్భముగా రంజాన్ తోఫా,మరియు చీరలు పంపిణి.



**కావలి : విజ్ఞాన్ దినపత్రిక న్యూస్** సామాజిక సేవకులు విశ్రాంత ఉప తాసీల్దారు మొఘల్ శిరాజ్ బేగ్,మొఘల్ సల్మా బేగం ఆధ్వర్యంలోవారి కుమారుడు, కోడలు, సమీర్ బేగ్, ఫర్హానాజ్ దాత్రుత్వం తో.. ఈనెల 20 వతేది రంజాన్ పండుగ పర్వదినం నేపద్యములో... పేద ముస్లిం, మహిళలు, వారికుటుంబం, సంతోషంగ పండుగజరుపుకోవాలని, దాదాపు 50మందికి,వారి కుటుంబములకు, కొంతైనా, ఆత్మీయ సహాయ, సహకారం అందించాలనే, మంచి సంకల్పంతో. రంజాన్ తో?ఫా(రంజాన్ నిత్యవసరవస్తువులు) తో పాటు, చీరలు, పంపిణి చేయడమైనది. ఈ సంధర్భముగ స్వచ్చంద సంస్థల, గౌరవ అధ్యక్షులు ూఖ. బాష మాట్లాడుచు.మొఘల్ శిరాజ్ బేగ్ కుటుంబ సభ్యులు, ఎంతో మంచి మనస్సుతో, పేద ముస్లిం కుటుంబాలు రంజాన్ పండుగ రోజు సతోషంగ, జరుపుకోవాలని, మంచి సదుద్దేశముతో, చేస్తున్న ఈ మంచి కార్యక్రమం నకు అభినందనలు, ధన్యవాదములు తెలియ చేస్తున్నామని, గతంలో కూడ వారికున్న పరిధిలోనిరుపేద, కుటుంబ ములకు, సహాయ సహకారములు అందంచారని చాలా సంతోషకర విషయం అని తెలిపారు.... పై కార్యక్రమం లో... రత్నమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు వీఎ. ప్రసాద్ రావు, మీకోసం సేవా సంస్థ అధ్యక్షులు, రాయపాటి దిలీప్ కుమార్,విశ్రాంత ఉపాధ్యులు,ఎ. అశోక్ మార్, వీణ అజామ్ తదితరులు పాల్గొన్నారు

## సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శిగా షేక్ జమాలుల్లా ఎంపిక

**-గూడూరులో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి**
**-సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి**



సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శిగా షేక్ జమాలుల్లా ఎంపికయ్యారు. బుధవారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ సమితి ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి నూతనంగా నియోజకవర్గ సహాయ కార్యదర్శిగా ఎంపికైన జమాలుల్లాకు బ్యాడ్జి ఇచ్చి, ఎన్నో ప్రజా ఉద్యమాలకు జమాలుల్లా నాయకత్వం వహించారని, ఆయన సేవలు గూడూరు నియోజకవర్గంలోని పార్టీకి కూడా పూర్తిగా కొనసాగించాలని . ఆయనను అభినందించారు. నియోజకవర్గ సహాయ కార్యదర్శిగా ఎంపికైన షేక్ జమాలుల్లా మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో సీపీఐ బలోతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. సీనియర్ నాయకుల సమన్వయంతో జిల్లా, రాష్ట్ర పార్టీ పిలుపునిచ్చే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్. ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి జీ. శశి కుమార్, చిల్లకూరు మండల కార్యదర్శి గుండాల రమేష్, పట్టణ కన్వీనర్ వై. సునీల్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి కే. నారాయణ, బీకేఎంయూ నియోజకవర్గ కార్యదర్శి ఎన్. శ్రీనివాసమూర్తి, మున్సిపల్ యూనియన్ రాఘవయ్య, ముఠా వర్కర్స్ యూనియన్ పెంచలయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మీరా, గౌస్ భాయ్, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

## డా॥ కిషోర్స్ రత్నం స్కూల్లో ముందస్తు ఉగాది సంబరాలు, అందరినీ ఆకట్టుకున్న విద్యార్థిని విద్యార్థుల ప్రదర్శన



డా॥ కిషోర్స్ రత్నం సరస్వతినగర్ కిడ్స్, రేస్ ఇంటర్నేషనల్, టెక్నో, మెడికల్ ఒలంపియాడ్ విద్యార్థినీ విద్యార్థులు ముందస్తు, పరాభవనామ సంవత్సర ఉగాది వేడుకలు అద్భుతంగా నిర్వహించారు. విద్యార్థులు వేద పఠనం, కలశపూజ మొదలగు కార్యక్రమాలనునిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు సంప్రదాయ దుస్తులను ధరించి తెలుగు దనానికి ప్రతీకగానిలిచారు. సంప్రదాయ రీతిలో శుభసూచకంగా గోమాతను పూజించి కార్యక్రమమునుప్రారంభించారు. మన తెలుగు సంప్రదాయలు ఉట్టిపడేలా చక్కటి నృత్యప్రదర్శనలు, పద్యాలు, పాటతో అలరించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ హిందూ పంచాగంలోని 60వ తెలుగు సంవత్సరాలలో 40 వ సంవత్స పరాభవ సంవత్సరం పరాభవం అనే పదానికి పరాజయం లేదా తగ్గుదల అని అర్థం కాని ఇది ప్రతికూలమైన అర్థానికే పరిమితం కాదు. జీవితంలో ఎదురయ్యే నవాళ్ళను గుర్తించి వాటిని అధిగమించే సమయంగా భావిస్తారు. ఈ సంవత్సరం ఆత్మపరిశీలన మరియు ఆత్మ వికాసానికి అనుకూలమైన కాలంగా పరిగణించాలి అని తెలియజేశారు. విద్యార్థులు ఉగాది పచ్చడి ప్రాముఖ్యతను షడ్రుచులు ఎటువంటి సందేశాన్ని అందిస్తాయెూ వివరించారు. పౌరాణిక, చారిత్రక ప్రాముఖ్యతను ఉగాది పండుగ విశిష్టతను వివరించారు. డా॥ కిషోర్స్ రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు డా॥ కృష్ణకిషోర్ వాసంతి కిషోర్ విద్యార్థులకువారి తల్లిదండ్రులకు పరాభవనామ ఉగాది శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ కార్యక్రమములో జూనియర్ మేనేజర్ అజయ్ , ఏ.ఓ. తుహీన, ఏ.ఓ. సునీల్ , ప్రిన్సిపాల్స్ మణిమాల, జ్యోతి, జాస్మిన్, నాగేంద్ర కోఆర్డినేటర్ జరిన్, విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## విధి ఆడే నాటకం

కాలం నీకు సహకరిస్తుందని
నువ్వు ఆడిందే ఆటగా
పాడిందే పాటగా అనుకోకు
నీ నక్క వినయాలతో
దిక్కుమాలిన చేష్టలు మానుకో
నీకు సహాయం చేసిన
పాతాళానికి తొక్కాలని చూస్తే
కర్మ అనే కబంధహస్తంలో
విధి ఆడే నాటక బలిపీఠంలో
నువ్వు కబలించబడతావ్.

నిన్ను నేలకేసి కొట్టి మరీ
పెన్నానది లోని బోడి గాడి తోటకు
పంపడానికి సిద్ధంగా ఉంటుంది
ఇంక నీ ఆటలు కొన్నాళ్ళే
కర్మ అనేది నిన్ను వదిలిపెట్టదు
ఓ ప్రక్క వెంటాడుతూనే
నిన్ను వేదిస్తూ ఉంటుంది.

అందుకే... నువ్వు ఇప్పటికైనా
మనసుకి హత్తుకునేలా మాట్లాడు
మనసునొచ్చుకునేలా మాట్లాడకు
మనస్ఫూర్తిగా మాట్లాడు
విలువలు కోల్పోయేలా మాట్లాడకు
చివరికి నీకు ఉన్న విలువపోతుంది
మొండిగా మాట్లాడకు
నువ్వు సాధించేది ఏమి ఉండదు.



**రచన : కె.మురళీమోహన్ రాజు**
**నెల్లూరు.**
**చరవాణి : 9866179385**

## విజేత స్కూల్లో "ముందస్తు ఉగాది వేడుకలు "

**పొదలకూరు :లి**



పట్టణంలోని విజేత ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ముందస్తు ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ +.కామాక్షి మాట్లాడుతూ ఉగాది అనేది తెలుగువారి నూతన సంవత్సర పండుగ అని, ఇది చైత్ర శుద్ధ పాడ్యమి నాడు వస్తుందని, ఆ బ్రహ్మదేవుడు సృష్టిని ప్రారంభించిన రోజుగా నమ్ముతారని చెప్పారు. వసంత ఋతువు ఆరంభంలో ప్రకృతి కొత్త శోభతో విలసిల్లు తున్నపుడు వచ్చే ఈ పండుగలో పడ్రుచుల ఉగాది పచ్చడి ( తీపి, పులుపు, కారం, ఉప్పు, చేదు, వగరు ) ముఖ్యమైనదిగా ఆమె తెలియజేశారు. తమ స్కూల్లో ముందస్తుగా ఈ పండుగను జరుపుకోవడం జరిగింది. ఆ దేవుని పటాలను అందంగా ముస్తాబు చేసి, పడ్రుచులతో ఉగాది పచ్చడి చేసి పిల్లలందరకు పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ +.కామాక్షి మరియు విద్యార్థినీ,విద్యార్థులు మరియు ఉపాధ్యాయునీ,ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది

## ఆర్టీసీ డ్రైవర్ నాగేశ్వరావు ఇకలేరు



**కావలి : విజ్ఞాన్ దినపత్రిక న్యూస్ :** కావలి రూరల్ మండలం చౌదరిపాళెం విశ్రాంతి ఆర్టీసీ డ్రైవర్ నాగేశ్వరరావు బుధవారం కన్నుమూశారు. ఆర్టీసీ డ్రైవర్ విధి నిర్వహణలో తక్కువ ఇంధనంతో ఎక్కువ ప్రయాణం చేసి ఉత్తమ డ్రైవర్ గా పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వం చే అవార్డు పొందున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సిబ్బంది ప్రజలు భౌతికాయాన్ని నివాళు

# షడ్రుచుల కలయిక ఉగాది..!

**-పరాభ నామ సంవత్సర శుభాకాంక్షలు .. !**
**-ఎమ్మెల్యే కాకర్ల సురేష్..!**



**వింజమూరు మార్చి 18** షడ్రుచుల కలయిక ఉగాది అని ఈ వేడుకను ప్రతి ఒక్కరు ఆనందంతో జరుపుకోవాలని ఉదయగిరి శాసనసభ్యులు శ్రీ కాకర్ల సురేష్ ,ఉగాది పర్వదినం పురస్కరించుకొని నియోజకవర్గ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ పరాభవ నామ సంవత్సర ఉగాది మీ ప్రతి ఇంటికి సంతోషం, శాంతి, సంపదలను తీసుకురావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో నిండిపోవాలని, రైతులు పుష్కల పంటలతో ఆనందంగా ఉండాలని, యువత తమ లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఉగాది మన సంప్రదాయాల సుగంధాన్ని, ఆశల వెలుగును తీసుకొచ్చే పర్వదినం. ఈ శుభసందర్భంగా మనం అందరం ఐక్యంగా ముందుకు సాగుతూ నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని, ప్రజలందరికీ మరోసారి ఎమ్మెల్యే శ్రీ కాకర్ల సురేష్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

# ఢిల్లీలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌తో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మర్యాదపూర్వక భేటీ..!

**-ఉదయగిరి అభివృద్ధిపై విస్తృత చర్చలు..!**
**-పర్యాటక కేంద్రంగా ఉదయగిరి రూపుదిద్దే ప్రతిపాదన..!**
**-పరిశ్రమల స్థాపనకు కేంద్ర సహకారం కోరిన ఎమ్మెల్యే కాకర్ల..!**
**-స్థానిక యువతకు ఉపాధి అవకాశాల పెంపుపై దృష్టి..!**
**-ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి మద్దతు కోరిన కాకర్ల సురేష్..!**

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ ని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అలాగే, ఉదయగిరి నియోజక వర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సేవలను గుర్తిస్తూ, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కూడా వారిని సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇద్దరు నాయకులు పరస్పరం అభివృద్ధి లక్ష్యాలపై సుదీర్ఘంగా చర్చించుకున్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఉదయగిరి నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలనే దిశగా పలు ముఖ్య అంశాలను ప్రస్తావించారు. ముఖ్యంగా ఉదయగిరిని ఒక ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి



చేయడానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి, యువతకు ఉపాధి అవకాశాలు పెంచేలా చర్యలు తీసుకోవాలనికోరారు. ఉదయగిరి ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధి, రోడ్లు, తాగునీరు, విద్యా మరియు ఆరోగ్య రంగాల్లో మరింత పురోగతి సాధించేందుకు కేంద్ర సహకారం ఎంతో అవసరమని వివరించారు. ఈ క్రమంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సానుకూలంగా స్పందిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలకు తగిన సహకారం అందించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

# రంజాన్ పండుగ సందర్భంగా నిరుపేద కుటుంబాలకు చీరలు నిత్యవసర సరుకులు పంపిణీ



**విజ్ఞాన పత్రిక** పొదలకూరు పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు ముందస్తు రంజాన్ పండగ సందర్భంగా నిరుపేద ముస్లిం కుటుంబాలకు చీరలు నిత్యావసరాలు సరుకులు ముస్లిం మత పెద్దలు ఇవ్వడం జరిగింది వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రంజాన్ పండగ జరుపుకోలేని నిరుపేద కుటుంబాలకు మా సంస్థ సందర్భంగా నిత్యావసరకులు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో పొదలకూరు ఎస్పైహనీఫ్ టిడిపి మండల అధ్యక్షుడు తలసీరు మస్తాన్ బాబు ముస్లిం మైనారిటీ షేక్ జమీర్ పట్టణ అధ్యక్షులు మల్లికార్జున నాయుడు ముస్లిం మత పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం



**. నెల్లూరు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం కావలి ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలోని 16వ తేదీ నుండి ఏప్రిల్ 29 వ తేదీ వరకు 4 నెలలు నిండిన అన్ని పశువులకు గాలి కుంటువ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు సహాయ సంచాలకులు డాక్టర్ వై వి నాగేశ్వరరావు తెలిపారు పశువైద్య సిబ్బంది పసుపోషకాలు ఇంటి వద్దకు వచ్చి ఉచితంగా టీకాలు వేస్తారని ఈ అవకాశాన్ని పశుపోషకాలు వినియోగించుకోవాలని తెలిపారు

# కావలిలో ఘనంగా శ్రీ గంగా భవానీ తిరునాళ్లు

**- 19న ఉగాది పర్వదినాన జలాభిషేకం, గ్రామోత్సవం**

**నెల్లూరు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ :**

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కావలి పట్టణంలోని లతా థియేటర్ ఎదురుగా ఉన్న గంగమ్మ గుడి వద్ద శ్రీ గంగా భవానీ తిరునాళ్లు, గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. మార్చి 19, గురువారం (ఉగాది) నాడు శ్రీ పరాభవ నామ సంవత్సర ప్రారంభం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు గంగమ్మ తల్లి భక్త బృందం వెల్లడించింది. 901 కలశపు బండెలతో జలాభిషేకం ఈ ఉత్సవంలో భాగంగా శ్రీ గంగా భవానీ అమ్మవారికి 901 కలశపు బండెలతో భారీ స్థాయిలో “జలాభిషేకం” నిర్వహించడం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. లోక కల్యాణం కోసం, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని కోరుతూ భక్తులు ఈ విశిష్ట కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. రోజంతా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సవ రోజున ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ కార్యక్రమాలు జరగనున్నాయి:ఉదయం 8:00 నుండి: అభిషేకం, పూలంగి సేవ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు.మధ్యాహ్నం 12:00 గంటలకు: అన్నదాన కార్యక్రమం.రాత్రి 7:00 గంటల నుండి: ప్రసాద వినియోగం, పాటకచ్చేరి. రాత్రి 10:00 గంటలకు: అమ్మ వారి



గ్రామోత్సవం అత్యంత శోభాయ మానంగా సాగనుంది .ప్రత్యేక ఆకర్షణలు గ్రామోత్సవంలో అమ్మవారికి స్వాగతం పలుకు తూ బొల్లా వూలు, వీరతాళ్లు, నెమలి ఆటలు, కోలంగురాలు, కొత్తగూడెం సాయి నాథ్ డ్రమ్స్ పార్టీ, డప్పు వాయిద్యాలు, టాల్‌మెన్ ప్రదర్శన మరియు భద్రకాళి-రాక్షసుడు వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు. గంగా భవానీ తిరునాళ్లకు భారీగా విరాళాలు: దాతల వివరాల ప్రకటన కావలి: కావలిలో జరగనున్న శ్రీ గంగా భవానీ తిరునాళ్లు, గ్రామోత్సవం నిర్వహణకు పలువురు ప్రముఖులు, దాతలు పెద్ద ఎత్తున ముందుకు వచ్చారు. ఈ ఉత్సవానికి సంబంధించిన లైటింగ్, మ్యూజికల్ నైట్ మరియు ఇతర సేవా కార్యక్రమాలకు విరాళాలు అందజేసిన దాతల వివరాలను ఉత్సవ కమిటీ ప్రకటించింది.ముఖ్య దాతలు ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచే కార్యక్రమాలకు రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు సహకారం అందించారు: లైటింగ్ దాత: రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు యాదవ్. మ్యూజికల్ నైట్ దాత: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్.వివిధ సేవల దాతలు ఉత్సవ నిర్వహణలో భాగంగా వివిధ కార్యక్రమాలకు విరాళాలు అందించిన వారు:901 బండెలు ఉ అన్నదానం: జనిగర్ల మహేంద్ర యాదవ్ (జె.యం. కన్స్ట్రక్షన్స్). లైన్ అర్ సౌండ్ సిస్టమ్: గుండ్లపల్లి భరత్ కుమార్ యాదవ్ (రూ. 51,116).అమ్మవారిని మోసే వారికి: జనిగర్ల మనోహర్ యాదవ్ (రూ. 50,116). అమ్మవారి ఊరేగింపు ఉ అలంకారం: బొంతా శ్రీనివాస్ యాదవ్ - రియల్టర్ (రూ. 45,116). టపాసులు: గుండ్లపల్లి రమణయ్య యాదవ్ (రూ. 45,116).దాతల సహకారంతో ఈ ఏడాది తిరునాళ్లను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

# సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి, చీరాల వారికి రామ్‌సూర్ అగ్రి యల్.యల్.పి వారితో కుదిరిన అవగాహనా ఒప్పందం



**చీరాల మార్చి 18** సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి, చీరాల,కు మరియు రామ్‌సూర్ అగ్రి యల్.యల్.పి వారితో అవగాహనా ఒప్పందము ( మెమొరాండమ్ ఆఫ్ అండర్ స్టాండింగ్ ) కుదిరినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణ రావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సంయుక్తముగా ఒక ప్రకటనలో బుధవారం తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా కె. జగదీష్ బాబు మాట్లాడుతూ రామ్‌సూర్ అగ్రి యల్.యల్.పి కు సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి వారికి అవగాహనా ఒప్పందము కుదిరినట్లు పేర్కొన్నారు. ఈ అవగాహనా ఒప్పందము వలన కళాశాల విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీస్ చెందిన ఎమర్జింగ్ టెక్నాలజీస్ మొ|| వాటిలో కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించుట, ఇంటర్షిఫ్ ట్రైనింగ్, ప్రాజెక్టుల రూపకల్పనలో కళాశాల విద్యార్థులకు అవకాశాలను కల్పింస్తారని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా|| లక్ష్మీ తులసి చావలి తెలిపారు. ఈ అవగాహనా ఒప్పందం 3 సం|| అమలులో ఉంటుందని అన్నారు. కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగముతో రామ్‌సూర్ అగ్రి యల్.యల్.పి వారి అవగాహనా ఒప్పందము కుదిరన సందర్భముగా వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు ఆనందం వ్యక్తం తెలియజేశారు.

# ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతులమీదుగా రంజాన్ తోఫా పంపిణీ

**-అర్హులైన ముస్లింలందరికీ త్వరలో ఇళ్లస్థలాలు అందిస్తాం**
**-కందుకూరులో షాదీఖానా ఏర్పాటు చేసే బాధ్యతనాది**
**-కూటమి ప్రభుత్వంలో ముస్లింల అభివృద్ధికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే**

**కందుకూరు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్** కందుకూరు పట్టణంలోని పేదలకు త్వరలో ఇళ్లస్థలాలు అందిస్తామని, పేద ముస్లిం కుటుంబాలకు అందులో మొదటిప్రాధాన్యత ఉంటుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా, పట్టణంలోని 150 మంది పేద ముస్లింలకు, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా బుధవారం రంజాన్ తోఫా అందించారు. మొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ షేక్ సలాం సొంత ఖర్చుతో సరుకులు అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ... ముస్లిం కుటుంబాలలో చాలామందికి సొంతగా ఇళ్లులేవని, కనీసం స్థలాలు లేని వారు చాలామంది ఉన్నారని నాగేశ్వరరావు అన్నారు. అలాంటి వారందరికీ త్వరలో తప్పక సహాయం అందుతుందని చెప్పారు. పట్టణంలో షాదీ ఖానా భవనాన్ని తప్పక నిర్మిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇమామ్, మౌజంలకు ముఖ్యమంత్రి చంద్రబాబు గారు 90 కోట్లు విడుదల చేశారని, తాజాగా మరో 45 కోట్లు ఇచ్చారని గుర్తు చేశారు. ముస్లింల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు సూచించారు. డబ్బు ఎంతోమంది దగ్గర ఉన్నప్పటికీ... సేవ చేయాలన్న ఆలోచన, దానగుణం కొద్దిమందిలో మాత్రమే ఉంటుందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. ప్రతిఒక్కరూ రంజాన్ పండుగ జరుపుకోవాలన్న మంచి ఆలోచనతో, పేదలకు తోఫా అందిస్తున్న సలాంను అల్లాహ్ చల్లగా చూడాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముస్లింలందరికీ ఆయన ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మత పెద్దలు రియాజ్



మౌలానా, ఫైరోజ్ మౌలానా, ముజీబ్ మౌలానా, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, ఏపీఈడబ్ల్యూఐడి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బెజవాడ ప్రసాద్, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, నెల్లూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి సలాం, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ మున్నా, పార్టీ నేతలు జియావుద్దీన్, ఫిరోజ్, ఖలీల్, బాషా, వలీ, వద్దేళ్ల రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూరు బస్టాండ్ సెంటర్ వద్ద అపరిశుభ్రత: హ్యాండ్ బోర్ చుట్టూ పేరుకుపోయిన మురుగు

**నెల్లూరు విజ్ఞాన్ పత్రిక రిపోర్టర్**



మండల కేంద్రమైన దగదర్తిలోని చెన్నూరు బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న హ్యాండ్ బోర్ (చేతి పంపు) పరిసరాలు అత్యంత అపరిశుభ్రంగా మారాయి. గ్రామ ప్రజల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన ఈ బోర్ చుట్టూ మురుగు నీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వ్యాధుల భయం : ప్రస్తుతం ఆ హ్యాండ్ బోర్ చుట్టూ పేరుకుపోయిన చెత్తాచెదారం, నిలిచిపోయిన నీటి వల్ల దుర్వాసన వెదజల్లుతోంది. ఈ ప్రాంతం దోమల ఉత్పత్తి కేంద్రంగా మారిందని, తద్వారా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు పట్టే చోట ఇలాంటి పరిస్థితులు ఉండటం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులకు విజ్ఞప్తి : సంబంధిత పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి, నిలిచిపోయిన మురుగు నీటిని తొలగించి హ్యాండ్ బోర్ చుట్టూ బ్లీచింగ్ చల్లించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# బాల్యవివాహాల నిర్మూలన బాలికల లింగ వివక్ష లేకుండా ఉన్నత విద్య అందించాలి

**కొండేపి మార్చి** మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా నేతివారిపాలెం లోని ప్రభుత్వ హైస్కూల్ నందు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశమునకు గర్భవతులు బాలింతలు కిశోర బాలికలు హాజరయ్యారు. ఈ సమావేశంలో బాల్యవివాహాల నిర్మూలన బాలికల లింగ వివక్ష లేకుండా ఉన్నత విద్య అందించాలని పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించాలని కిషోర్ బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆడపిల్లను బతకనిద్దాం ఆడపిల్లకు స్వేచ్ఛనిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్, మేరవలి స్కూల్ సిబ్బంది సీతారామయ్య, ఎస్.కె రహీం, బేగం, అంగన్వాడీ టీచర్లు పున్నమ్మ, అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Bulidings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buildings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.